ఆరు గ్యారెంటీలు అమలయ్యేలా చూస్తాం

36వ డివిజన్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, జనవరి 3: అభయహస్తం ఆరు గ్యారెంటీలు నెరవేర్చేలా ప్రజల పక్షాన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతామని మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. నగరంలోని 53, 36, 27వ డివిజన్లలోబుధవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాల కోసం డివిజన్ల వారీగా ప్రజలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి డివిజన్‌లో అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంలో అన్ని వివరాలను నమోదు చేసి అధికారులకు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు తుల శ్రీదేవి-చంద్రమౌళి, గుగ్గిళ్ల జయశ్రీ-శ్రీనివాస్, గౌసియాబేగం, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీ, బల్దియా అధికారి సుభాష్ పాల్గొన్నారు.

పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

మానకొండూర్ రూరల్: ముంజంపల్లిలో దరఖాస్తును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

తిమ్మాపూర్/ మానకొండూర్ రూరల్, జనవరి 3: సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ అధికారులకు సూచించారు. బుధవారం తిమ్మాపూర్ మండలం నల్లగొండ, మానకొండూర్ మండలం ముంజంపల్లి గ్రామాల్లో అభయహస్తం గ్యారెంటీల దరఖాస్తు ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. కౌంటర్ల వద్ద దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో నల్లగొండ సర్పంచ్ దన్నమనేని శోభనరింగరావు, ఎంపీటీసీ పద్మ, స్పెషల్ ఆఫీసర్ జయశంకర్, ఎంపీవో కిరణ్‌కుమార్, ఏపీఎం రామ్మోహన్, ముంజంపల్లి సర్పంచ్ గోపాల్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేశ్వర్ రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిమ్మాపూర్ సీఐగా స్వామి

తిమ్మాపూర్, జనవరి 3: తిమ్మాపూర్ సర్కిల్ సీఐగా కే స్వామిని నియమిస్తూ మల్టీ జోన్ ఐజీ తరుణ్ జోషి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. చాలాకాలంగా టీఎస్ ట్రాన్స్‌కోలో పని చేస్తున్న ఆయన త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

పార్టీలో చేర్చుకుని.. కౌన్సిలర్ల మధ్య చిచ్చుపెట్టి

- జమ్మికుంట మున్సిపల్‌పై కాంగ్రెస్ పెద్దల కుట్రలు
- అవిశ్వాసం పేరిట బీఆర్ఎస్ కౌన్సిలర్లతో క్యాంపు రాజకీయం
- కౌన్సిలర్లను కిడ్నాప్ చేశారని చైర్మన్ వర్గం ఆరోపణలు
- ఇరువర్గాల మధ్య గొడవ.. చైర్మన్, కౌన్సిలర్లపై ప్రత్యర్థి వర్గం దాడి?
- చోద్యం చూస్తున్న కాంగ్రెస్ పెద్దలు

జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం

జమ్మికుంట, జనవరి 3: కాంగ్రెస్ అంటేనే కుట్రలకు పెట్టింది పేరు. అలాంటి పార్టీ అలా అధికారంలోకి వచ్చిందో లేదో జమ్మికుంట మున్సిపల్‌పై రాజకీయ కుట్రలకు తెరతీసింది. బీఆర్ఎస్ కౌన్సిలర్‌గా గెలిచి పార్టీ విధేయుడిగా ఉంటున్న సభ్యుడిని పార్టీలో చేర్చుకుని కౌన్సిలర్ల మధ్య చిచ్చుపెట్టి, అవిశ్వాసం పేరిట క్యాంపు రాజకీయాలకు తెరతీసింది. అయితే, కౌన్సిలర్లను కిడ్నాప్ చేశారంటూ వెళ్లిన చైర్మన్ వర్గంపై దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపుతుండగా, ఈ తతంగమంతా కాంగ్రెస్ పెద్దలు నడిపిస్తున్నారనే చర్చ జరుగడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

29 మంది సభ్యులూ బీఆర్ఎస్సే..

2020 జనవరిలో కొలువుదీరిన జమ్మికుంట మున్సిపల్‌లో 29 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉండగా, 24వ వార్డు కౌన్సిలర్ సాయిని రమ కాంగ్రెస్‌లో ఉన్నారు. నాలుగేళ్లుగా సమస్యల్లేని మున్సిపల్‌గా ముందుకు నడిపిస్తున్నారు. రెండేళ్ల క్రితం వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి ఆధ్వర్యంలో మున్సిపల్‌లో ముసలం పుట్టినప్పటికీ, అప్పటి బీఆర్ఎస్ పెద్దలు సమస్యను సద్దుమణిగేలా చేశారు. సభ్యులందరినీ ఏకం చేశారు.

బీఆర్ఎస్‌తో గెలిచి.. కాంగ్రెస్‌లో చేరి..

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పొనగంటి మల్లయ్యకు పార్టీ అనేక అవకాశాలు ఇచ్చింది. గతంలో అతడి భార్య శారదను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమించింది. అంతేకాకుండా మల్లయ్యకు 23వ వార్డు కౌన్సిలర్‌గా బీఫాం అందించి, గెలిపించింది. పార్టీకి విధేయుడిగా ఉంటూనే, ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాడు. ఈ క్రమంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే, మున్సిపల్‌లో ముసలం పుట్టేలా పార్టీ పెద్దలు పావులు కదిపారు. మల్లయ్య ఆధ్వర్యంలో 20 మంది కౌన్సిలర్లతో అవిశ్వాసానికి తెరలేపారు. సంతకాలతో కూడిన కాపీని జిల్లా కేంద్రంలో డీఆర్వో పవన్‌కుమార్‌కు గత నెల 29న అందజేశారు. కాంగ్రెస్ పెద్దల ఆదేశాలతో పోలీసులు పొనగంటి మల్లయ్య వర్గానికి బందోబస్తు కల్పించారు. క్యాంపునకు తరలేందుకు సహకరించారు.

23 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లోనే..

మల్లయ్య అవిశ్వాస పత్రం అధికారులకు అందించిన 24 గంటలు గడువకముందే, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు కలెక్టర్ పమేలా సత్పతిని కలిశారు. మల్లయ్య అవిశ్వాసం తప్పని, కౌన్సిలర్ల మద్దతు తమకే ఉందని సంతకాల పత్రం ఇచ్చారు. ఇదే సమయంలో 20 మంది కౌన్సిలర్ల మద్దతు ఉందన్న మల్లయ్య క్యాంపు నుంచి పలువురు కౌన్సిలర్లు జారుకున్నారు. చైర్మన్ రాజేశ్వర్‌రావు వర్గంలో చేరారు. మూడు రోజుల్లో అయిదుగురు కౌన్సిలర్లు చేరారు. దీంతో ఎటూ పాలుపోని కాంగ్రెస్ పెద్దలు తలలు పట్టుకున్నారు. కౌన్సిలర్లు చైర్మన్ వర్గానికి మద్దతు పలకడంపై సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తున్నది.

దాడులకు పాల్పడిన నాయకులు..

20 మంది మద్దతు ఉందన్న మల్లయ్య వర్గంలో 15 మంది మిగిలారని సదరు వర్గమే చెబుతోంది. అందులోని మరో ఐదుగురు చైర్మన్ వద్దకు వెళ్లేందుకు సిద్ధమవగా, వాళ్లను క్యాంపు నుంచి బయటకు రాకుండా చేశారు. ఇక చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, తదితరుల ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ నియోజకవర్గం కొత్తూరు మండలంలోని కాంగ్రెస్ పెద్దల ఫాంహౌస్‌లోకి మల్లయ్య క్యాంపునకు వెళ్లారు. తమ కౌన్సిలర్లతో మాట్లాడేందుకు యత్నించగా, దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇదిలా ఉండగా అవిశ్వాసం ఎలాగైనా నెగ్గించుకునేందుకు సర్వశక్తులా కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. అయితే అవిశ్వాసానికి 1/3 మెజార్టీ, విప్ జారీతో నెగ్గడం కష్టమేనని తెలుస్తోంది. సభ్యులంతా చైర్మన్ వైపే ఉండేందుకు మొగ్గు చూపుతున్నారు. అవిశ్వాస సమయంలో కూడా ప్రత్యర్థికి సభ్యులు సహకరించరనే వాదనలు వినిపిస్తున్నాయి.

జమ్మికుంట: పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఘనంగా పూలే జయంతి వేడుకలు

జమ్మికుంట/ మానకొండూర్ రూరల్/ శంకరపట్నం/ చొప్పదండి/తెలంగాణచౌక్/కరీంనగర్ రూరల్/హుజూరాబాద్‌టౌన్/వీణవంక, జనవరి 3: జిల్లా వ్యాప్తంగా బుధవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. మానకొండూర్ మండలం పచ్చునూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ తరపున మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. హెచ్ఎం మధుకర్, టీపీటీఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. శంకరపట్నం మండలం లింగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో వేడుకలకు ఎంపీడీవో శ్రీవాణి ముఖ్య అతిథిగా హాజరై సీనియర్ మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. చొప్పదండి మండలం రేవెల్లి పాఠశాలలో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో గురుకుల ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సిరిపురం ఆనందం, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సంభోజి శేఖర్, ప్రిన్సిపాల్ స్వాతి పాల్గొన్నారు. కరీంనగర్‌లోని రిషి కాన్వెంట్‌లో పూలే చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి, ఉపాధ్యాయులు పూల మాలలు వేసి నివాళుర్పించారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పెంట అజయ్, హరికుమార్‌గౌడ్, వేణుగోపాల్, మధుబాబు, కిషన్, మహేశ్ పాల్గొన్నారు. ముకరంపురలోని ప్రభుత్వ పాఠశాలలో పూలే చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దేవరకొండ సంతోషి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్స్ అందజేశారు. సంఘం నాయకుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నగరంలోని తెలంగాణ చౌక్‌లో పూలే చిత్రపటానికి బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు స్వరూప-శ్యామ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నరేందర్, శ్రీకాంత్, మారుతి, శేఖర్ పాల్గొన్నారు. ఎస్‌యూ ఎడుట గల పూలే విగ్రహానికి బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వంగ వెంకటేశ్వర్లు పూల మాల వేసి నివాళులర్పించారు. నాయకులు శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు. డీవైఎఫ్ఐ కార్యాలయంలో పూలే చిత్రపటానికి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి పూల మాల వేసి నివాళులర్పించారు. శివరాజు, అఖిల, ప్రియ, అజయ్ పాల్గొన్నారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరి, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సమత, ఎస్ సుష్మ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ లావణ్య, రోజా రమణి, అధ్యాపకులు పాల్గొన్నారు. హుజూరాబాద్‌లోని జ్యోతిబా పూలే చౌరస్తా వద్ద జరిగిన సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ హాజరై కేక్ కట్ చేశారు. వీణవంక మండలం ఘన్ముక్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్లో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్, ఇన్‌చార్జి హెచ్ఎం తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐ వంశీకృష్ణ బాధ్యతల స్వీకరణ

వీణవంక/ హుజూరాబాద్‌టౌన్, జనవరి 3: వీణవంక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా వంశీకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం హుజూరాబాద్ కేసీ క్యాంప్‌లోని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో ఏసీపీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

విద్యానగర్, జనవరి 3: కేడీసీసీబీ ద్వారా అందించే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయిల్‌పామ్‌తో పాటు అంతర పంటల సాగుకు కేడీసీసీబీ ద్వారా ఇస్తున్న రుణాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఉద్యానవన పంటలు, వర్మింగ్ క్యాపిటల్, పాడి పశువులు, చేపల పెంపకం, పౌల్ట్రీలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఉమ్మడి జిల్లాకు ప్రతిపాదించి, రాష్ట్రస్థాయి సాంకేతిక సమావేశానికి సిఫారసు చేశారు. నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్, కేడీసీసీ ముఖ్య కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, కరీంనగర్, జగిత్యాల జిల్లాల ఎల్‌డీఎంలు ఆంజనేయులు, వెంకట్ రెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల వ్యవసాయాధికారులు శ్రీధర్, భాస్కర్, పశువైద్యాధికారి నరేందర్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తు స్వీకరించాలి

హుజూరాబాద్‌టౌన్, జనవరి 3: అభయహస్తం గ్యారెంటీలకు ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం హుజూరాబాద్ మండలం వెంకట్రావ్‌పల్లి, సిర్సపల్లితోపాటు హుజూరాబాద్ పురపాలక సంఘ కార్యాలయంలో 14, 24వ వార్డులకు సంబంధించి నిర్వహిస్తున్న దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దరఖాస్తుదారులకు ఇబ్బందులు తలెత్తకుండా టెంట్, మంచినీరు, కుర్చీల వంటి కనీస ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద దరఖాస్తును రాయలేని వారి కోసం సహాయకులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోజువారీగా వచ్చిన దరఖాస్తులను ఎక్సల్ ఫార్మాట్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఆర్డీవో ఎస్ రాజు, మున్సిపల్ కమిషనర్ ఎస్ సమయ్య, ప్రత్యేకాధికారి పద్మావతి, ఎంపీడీవో జయశ్రీ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గంగాధర, జనవరి 3 : మండలంలోని గట్టుభూత్కూర్ మాజీ సర్పంచ్ రోమాల రమేశ్ మాతృమూర్తి దుర్గమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. దుర్గమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్‌ను ఓదార్చారు. ఆయన వెంట కంకణాల రాజ్‌గోపాల్‌రెడ్డి, సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి, నాయకులు బొడ్డు మల్లేశం, శ్రీకాంత్ ఉన్నారు.

ప్రజా పాలనలో ఇబ్బందులు రాకుండా చూడాలి

కార్పొరేషన్, జనవరి 3: ప్రజాపాలన కార్యక్రమాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ సూచించారు. స్థానిక బల్దియా సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ఆయన ప్రజాపాలన కార్యక్రమం టీం లీడర్లు, ఇన్‌చార్జులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ, వచ్చిన ప్రతి దరఖాస్తు స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తిమ్మాపూర్, జనవరి 3: కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు వివరాల ప్రకారం.. మల్లాపూర్ గ్రామానికి చెందిన కోమటి శివసాయి(23) సెల్‌ఫోన్ రిపేరింగ్ చేసేవాడు. ఇటీవల అయ్యప్ప దీక్ష స్వీకరించాడు. ఈ క్రమంలో కడుపు నొప్పి ఎంతకూ తగ్గకపోవడంతో ఈనెల 1న ఎల్ఎండీ రిజర్వాయర్ కట్టపైకి వెళ్లి పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని అతడి బావ నరేశ్‌కు ఫోన్ చేసి చెప్పడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఓ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంలో చేర్పించగా, పరిస్థితి విషమించి బుధవారం చనిపోయాడు. శివసాయి తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చేరాలు తెలిపారు. కాగా, ఎవరో అమ్మాయి పేరు పలుకుతూ.. 'వన్స్ అగేయిన్ హ్యాపీ బర్త్ డే, నీ సంతోషం.. హ్యాపినెస్ కోసం చిన్నగిఫ్ట్' అంటూ శివసాయి పురుగుల మందును తాగుతున్న సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

అద్దె బస్సుల యజమానుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణచౌక్, జనవరి 3: అద్దె బస్సుల యజమానుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, డిపో-1 అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నగరంలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ, బస్సులు అధిక లోడ్‌తో నడవడం వల్ల మైలేజీ రాక డీజిల్ భారం పడుతున్నదన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించని యెడల రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈ నెల 5వ తేదీ నుంచి అద్దె బస్సులను నిలిపివేస్తామన్నారు.

తొమ్మిది మందిపై కేసు

రాంనగర్, జనవరి 3 : నగరంలోని రాంనగర్ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో మంగళవారం అర్ధరాత్రి దాడి చేసిన ఘటనలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. డిసెంబర్ 31 వేడుకల సందర్భంగా రాంనగర్ ఎస్సీ హాస్టల్ ముందు గొడవ జరిగింది. దానిని దృష్టిలో పెట్టుకొని మంగళవారం రాత్రి 11.30 గంటలకు సాయిరాం, నాగరాజు, అరుణ్, సిద్ధార్థ, మధు, రవి ప్రసాద్, శ్రీధర్, ఈశ్వర్, పవన్ హాస్టల్‌లోకి అక్రమంగా ప్రవేశించి వేల్పుల మధు, ఇతర విద్యార్థులను కర్రలు, రాళ్లతో కొట్టారు. ఇంతలో హాస్టల్ వాచ్‌మెన్ గూడూరి సతీశ్ అడ్డురాగా అతని తలపై కూడా కొట్టారు. వేల్పుల మధు ఫిర్యాదుపై తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు.

వివరాలు నమోదు చేయాలి

కలెక్టరేట్, జనవరి 3: జిల్లాలోని పలు చోట్ల జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం శిబిరాల్లో నిర్వహించిన వైకల్య నిర్ధారణ పరీక్షల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు జక్కుల సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం గౌరవాధ్యక్షుడు కొలకాని నర్సయ్య, ప్రధాన కార్యదర్శి కైరి అంజయ్య, నాయకులు కట్ట రవీందర్, జంపాల భిక్షపతి, గంటి స్వరూప, ఆరెల్లి బాలు ఉన్నారు.

ఉద్యోగికి అభినందన

ముకరంపుర, జనవరి 3: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుంటూరులో నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో చీకటి పువ్వు నాటిక తృతీయ స్థానంలో నిలిచి నంది బహుమతి గెలుచుకున్నది. ఈ నాటికకు ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మంచాల రమేశ్ దర్శకత్వం వహించారు. కాగా, బుధవారం రమేశ్‌ను ఎస్ఈ గంగాధర్, పలువురు అధికారులు, ఉద్యోగులు సత్కరించి, అభినందించారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

కమాన్‌చౌరస్తా, జనవరి 3: ఎస్‌యూ పరిధిలో డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమైనట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడో సెమిస్టర్‌లో 13337 మంది విద్యార్థులకు గానూ 12803 మంది హాజరు కాగా, మొదటి సెమిస్టర్ పరీక్షలో 14923 మంది విద్యార్థులకు గానూ 13526 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను అధికారులు తనిఖీ చేస్తారని, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడవద్దని సూచించారు.

కళాశాల తనిఖీ

చిగురుమామిడి, జనవరి 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి తనిఖీ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ ఉన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

తెలంగాణచౌక్, జనవరి 3: నిత్యం ధ్యానం చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని బ్రహ్మకుమారీ బీకే మనీషా బహెన్ జీ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్ భవనంలో బ్రహ్మకుమారీల సంస్థ, జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆమె మాట్లాడారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

చొప్పదండి, జనవరి 3: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర మణికంఠ ఆలయ అభివృద్ధికి దాతల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణానికి చెందిన చల్ల లత-వెంకటేశం దంపతులు రూ.51,116, కాట్నపల్లికి చెందిన స్వతంత్ర భారతి- నరోత్తమ రెడ్డి దంపతులు రూ.10,121 అందజేశారు.

ఆరు గ్యారెంటీల అమలు కోసమే ప్రజాపాలన

గంగాధర, జనవరి 3: ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మధురానగర్, మల్లాపూర్ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలనలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్కం అనురాధానర్సయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, సర్పంచులు వేముల లావణ్యాఅంజి, ఆకుల శంకరయ్య, నాయకులు సత్తు కనకయ్య, వొడ్నాల యజ్ఞేశ్, కోల ప్రభాకర్, దాతు అంజి, పెంచాల చందు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

శంకరపట్నం, జనవరి 3: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని డీఎంహెచ్‌వో లలితాదేవి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కొత్తగట్టులో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీహెచ్‌సీ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఇక్కడ నార్మల్ డెలివరీలు చేయాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అన్ని ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, వైద్యాధికారి డీ శ్యాం ప్రసాద్, హెచ్ఈ ప్రతాప్, ఫార్మాసిస్ట్ మతిన్, సిబ్బంది ఉన్నారు.

తెలుగు మహాసభల్లో కరీంనగర్ కవులు

కమాన్‌చౌరస్తా, జనవరి 3: రాజమహేంద్రవరంలోని గైట్ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రా సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ సారథ్యంలో ఆంధ్రా సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 5, 6, 7వ తేదీల్లో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నారు. ఇందులో భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ప్రతినిధిగా హాజరయ్యారు. కవి సమ్మేళనంలో తనతో పాటు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత డాక్టర్ ముదుగంటి సుధాకర్ రెడ్డి, నూజెట్టి రవీంద్రనాథ్, కల్వల రాజశేఖర్ రెడ్డి, కాసు మహేందర్ రాజు, ఇమ్మడోజు మహేందర్, సయ్యద్ సమీనా పర్వీన్, ఛత్రపతి ప్రజాపతి, రామకృష్ణ కవితా పఠనం చేస్తారని వైరాగ్యం ప్రభాకర్ వివరించారు.

మున్నూరుకాపులు రాజకీయ శక్తిగా ఎదగాలి

గంగాధర, జనవరి 3 : రాష్ట్ర రాజకీయాల్లో మున్నూరుకాపులు రాజకీయ శక్తిగా ఎదగాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ పిలుపునిచ్చారు. మండలంలోని మధురానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, త్వరలోనే గ్రామ, మండల, జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఫిబ్రవరి 4న వేములవాడలో మున్నూరుకాపు నిత్యాన్నదాన సత్రం వార్షికోత్సవానికి సంఘం సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ సంఘం నియోజకవర్గ